క్లుప్తంగా

వైభవంగా పల్లకీ ఉత్సవం



స్వామి అమ్మ వార్లకు పల్లకీ సేవ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆదివారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపారు.

వీబీఆర్‌కు 16 వేల క్యూసెక్కుల నీరు



వీబీఆర్‌లోకి వస్తున్న కృష్ణా జలాలు

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. ఆదివారం బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 16 వేల క్యూసెక్కులు వచ్చి వీబీఆర్‌లోకి చేరినట్లు గంగ ఏఈ శివనాయక్ తెలిపారు. ఈ నెల 27న పోతిరెడ్డిపాడు వద్ద అధికారులు కృష్ణా జలాలు విడుదల చేశారు. దీంతో లింక్ ఛానల్ ద్వారా వీబీఆర్‌కు మొదటి రోజు 8 వేలు, ఆదివారం 16 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున

మహానంది: గ్రామాల్లో చిన్న చిన్న సమస్యల కోసం గొడవలకు దిగకుండా ప్రశాంతమైన వాతావరణంలో జీవనం సాగించాలని బండిఆత్మకూరు ఎస్ఐ మల్లికార్జున సూచించారు. బండిఆత్మకూరు మండలం ఎర్రగుంట్ల గ్రామంలో ఆదివారం నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. బైకుల మీద వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో లాల్ షా వలి జార్తలు



లాల్ షా వలి స్వామి పీరు

మహానంది: గాజులపల్లె మజరా గ్రామమైన బసవాపురం గ్రామంలో లాల్ షా వలి స్వామి జార్తలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు మకానం వద్దకు చేరుకుని శ్రీ లాల్ షా వలి స్వామి పీరును దర్శించుకున్నారు. స్వామి వారికి పూల బాసికాలు, గంధం, కొబ్బరికాయలు సమర్పించి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. పీర్ల గ్రామోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

రేపు ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ

జూపాడుబంగ్లా: తాటిపాడు, జూపాడుబంగ్లా జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్లపై ఈనెల 30న అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్ అధ్వర్యంలో విచారణ చేపట్టనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ ఆదివారం తెలిపారు. ఈనెల 20న జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం బహిరంగ సభలో జూపాడుబంగ్లా ఫీల్డ్‌అసిస్టెంట్లు లక్ష్మీదేవమ్మపై ఆ గ్రామ సర్పంచ్ మొట్టె బాలస్వామి, ఎంపీటీసీ మోతె వెంకటమ్మ ఫిర్యాదు చేశారన్నారు. అలాగే తాటిపాడు ఫీల్డ్‌అసిస్టెంటు లింగన్నపై ఆ గ్రామసర్పంచ్ వంగల లక్ష్మీదేవమ్మ ఫిర్యాదు చేశారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 30న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్ విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. విచారణకు ఫీల్డ్‌అసిస్టెంట్లు లక్ష్మీదేవమ్మ, లింగన్నలతో పాటు ఉపాధిహామీ పథకం ఏపీఓ గౌరీబాయి, టీఏలు, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్లు, హాజరుకావాలని సూచించారు.

సీనియర్ పాత్రికేయుడి మృతి

నందికొట్కూరు: సీనియర్ పాత్రికేయుడు మహమ్మద్ అలీ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ నాయకులు గౌరు వెంకటరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సీపీఐ నాయకులు ఆదివారం ఆయన పార్థివ దేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. మహమ్మద్ అలీ 40 ఏళ్లుగా పాత్రికేయ రంగంలో పని చేసి ప్రజలకు సుపరిచితుడిగా ఉన్నారు.


ఆధార్ శిబిరాలు ఎక్కడ?

- తేదీలు ప్రకటించారు.. క్యాంపులు పెట్టడం మరిచారు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- పరికరాలు మరమ్మతులకు గురయ్యాయంటున్న డిజిటల్ అసిస్టెంట్లు



జూపాడుబంగ్లా: తల్లికి వందనం పథకం వర్తించాలంటే తల్లులు, పిల్లల ఆధార్‌కార్డులు తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు ప్రతి మండలంలో ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మండలంలో నాలుగు రోజుల పాటు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు జూపాడుబంగ్లా ఎంపీడీఓ నూర్జహాన్ ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 23న 80బన్నూరు, మండ్లెం, 24న తరిగోపుల, 25న పారుమంచాల, 26న తర్తూరు, 27న భాస్కరాపురం, మండ్లెం గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వుల మేరకు ఆధార్ కేంద్రాలు నిర్వహించాల్సి ఉండగా ఏ ఒక్క గ్రామంలోనూ నిర్వహించకపోవడంతో ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చిన ప్రజలు నిరాశగా వెనుదిరిగి వెళ్లారు. ఈ విషయమై తరిగోపుల, తర్తూరు పీఏసీలు శాంతయ్య, ఖాజాను వివరణ కోరగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు షెడ్యూల్ విడుదల చేశారని, అయితే నిర్ణీత తేదీల్లో శిబిరాలు పెట్టకపోవడంతో ప్రజలు నిరాశతో వెనుదిరిగివెళ్లినట్లు చెప్పారు. ఆధార్ కేంద్రాల నిర్వాహకులైన జూపాడుబంగ్లా, మండ్లెం డిజిటల్ అసిస్టెంట్లు రాముడు, మహమ్మద్ రహీత్‌లను వివరణ కోరగా.. ఆధార్ సేవలకు అవసరమయ్యే పరికరాలు మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. ఈ విషయాన్ని లిఖితపూర్వకంగా ఎంపీడీఓతో పాటు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అయినా పరికరాలను బాగు చేయించకపోవడంతో కేంద్రాలు నిర్వహించడం లేదని వివరించారు. తల్లికి వందనం పథకం కోసం ఆధార్ అప్‌డేట్ తప్పనిసరని ప్రభుత్వం పేర్కొన్న నేపథ్యంలో ఆధార్ అప్‌డేట్ చేయించుకొనే వెసలుబాటు మండలంలో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

18 వేల క్యూసెక్కుల నీరు విడుదల



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా విడుదలవుతున్న నీరు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఆరు గేట్ల నుంచి 18 వేల క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదలను పెంచినట్లు తెలిపారు. శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రం 873.40 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 872.40 అడుగుల నీటిమట్టం నమోదైనట్లు తెలిపారు. ఆరు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సారెమ్సీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 10 వేల క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ కాల్వకు 5 వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 3 వేల క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు. సోమవారం జరిగే ఐఏబీ సమావేశంలో తెలుగుగంగ, ఎస్సార్బీసీ, కేసీ ఎస్కేప్ కాల్వలకు ఎన్ని టీఎంసీల నీటిని కేటాయిస్తారు, ఎప్పటి నుంచి ఎప్పటిదాకా సాగు నీటిని విడుదల చేస్తారనే విషయాలపై ఉన్నతాధికారులు సమీక్షిస్తారని చెప్పారు.

కేసీ కాల్వకు నీటి విడుదల



కేసీలో ప్రవహిస్తున్న నీరు

జూపాడుబంగ్లా/పగిడ్యాల: కర్నూలు–కడప కాల్వకు ఆదివారం సాగునీరు విడుదల చేశారు. తుంగభద్ర డ్యాం నిండటంతో సుంకేసుల జలాశయంలోకి 1,46,746 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. సుంకేసుల డ్యాం లో 1.2టీఎంసీల నీటిని నిల్వచేసుకొని మిగిలిన నీటిని శ్రీశైలం జలాశయంలోకి, కేసీ కాల్వకు 1,500 క్యూసెక్కుల సాగు నీటిని విడుదల చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ప్రస్తుతం లాకిన్స్‌లా వరకు 700క్యూసెక్కుల సాగునీరు చేరుతుండగా ఈ నీటిని నిప్పులవాగుకు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. నేడు ఐఏబీ సమావేశం ఉన్నందు కేసీ కాల్వకు ఎన్ని టీఎంసీల నీటిని కేటాయిస్తారు, ఎప్పటి నుంచి ఎప్పటిదాకా సాగునీటిని సరఫరా చేస్తారనే విషయాలు వెల్లడవుతాయని ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు.

భగవద్గీతపై ప్రచారం

నందికొట్కూరు: మండల పరిధిలోని కోనేటమ్మపల్లె, వడ్డెమాన్ గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రబోధ సేవా కమిటీ సభ్యులు ప్రచారం నిర్వహించారు. మానవ కోరికలు, కర్మలు పూర్తిగా లేకుండా పోతే ఉత్తరాయణం రోజు మోక్షం కలిగి విముక్తి కలుగుతుందని సేవా సమితి సభ్యులు రామచంద్రుడు, మునిదాసు వివరించారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానం తెలియజేయడమేనని చెప్పారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, కుమారాచారి, శేషన్న, మద్దిలేటి, మనోహర్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

సత్తెమ్మకు బోనాల సమర్పణ



అమ్మవారికి బోణాలు సమర్పిస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని కోటకందుకూరు గ్రామానికి వెళ్లే దారిలో వెలసిన సత్తెమ్మ అమ్మవారికి ఆదివారం పట్టణ వాసులు ఘనంగా బోనాలు సమర్పించారు. వర్షాలు కురిసి పంటలు బాగుండాలని కోరుతూ గండాదీపం మోస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, అభిషేకాలు చేపడతామన్నారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళహారతి, పల్లకిసేవ, అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

ఘనంగా మౌలాలి స్వామి సరిగెత్తు

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో మౌలాలిస్వామి సరిగెత్తు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న వేడుకల్లో భాగంగా రాత్రి స్వామి వారి సవారీ జరిగింది. అంతకుముందు భక్తులు పీర్లచావిడి దగ్గర స్వామి వారికి టెంకాయలు, ఊదిబత్తీలు, పూల షేరాలు, దట్టీలతో స్వామివారిని దర్శించుకున్నారు. డప్పుల హోరుతో గ్రామంలో సందడి నెలకొంది. యువకులు, చిన్నా పెద్దా తేడా లేకుండా డ్యాన్సులు వేస్తూ ఆనందంగా రెండు రోజుల పాటు మౌలాలి స్వామి వారి వేడుకలు జరుపుకున్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

నందికొట్కూరు: ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదల చేయాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పెట్టుబడి సహాయం కింద నిధులను రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయాలన్నారు. అలాగే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద ఎకరాకు రూ.లక్ష ఇవ్వాలని, రెండు లక్షల వరకు జీరో వడ్డీ కింద రైతులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. రైతులు, కౌలు రైతుల పరిస్థితి రోజు రోజుకు దిగజారుతుందని గుర్తు చేశారు. రైతుల పట్ల, వ్యవసాయం పట్ల రాష్ట్రంలో పాలకులు వివక్ష చూపడం సరైందని కాదన్నారు. టీడీపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నీ తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మదనపల్లెలో జరిగే రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం నాయకులు సోమన్న, మాబాషా, దాదాబాషా, సుధాకర్, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నంద్యాల(న్యూటౌన్): కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్ రంగానికి ఉపయోగ పడే విధంగా చట్టాలను మార్పు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నందికొట్కూరులో జరిగే జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియ్య పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు సదస్సులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని తొగట వీర సత్రంలో సోమవారం నుంచి బుధవారం వరకు రైతు సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాల జిల్లాల నుంచే కాకుండా నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి రైతు సంఘాల నాయకులు, రైతులు సదస్సులో పాల్గొంటారన్నారు. మూడు రోజులపాటు జరిగే సదస్సులో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించాలి

ఆత్మకూరు: ఆంధ్ర రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి చాలా అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్ లో సీపీఎం పట్టణ కమిటీ సమావేశం పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్ అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ 2014లో అధికారంలోకి రాకముందు ఏపీకి ప్రత్యేక హోదా 15 సంవత్సరాలు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చిందన్నారు. కానీ దాదాపు 11 సంవత్సరాలు అవుతున్నా నేటికీ ఆచరణలో అమలు కాలేదన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ, జనసేన పార్టీ భాగస్వామిగా ఉన్నారని, పట్టుపట్టి హామీలు సాధించాలన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ నాయకులు మంజుల, స్వాములు, నాగేశ్వరరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మొక్కజొన్న పైరు

కొత్తపల్లి: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో ఏ పొలంలో చూసినా వర్షపునీరు నిలిచింది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలు మొక్కజొన్న, పత్తి, మినుము, పెసర, కంది, మునగ, వరి పంటలను సాగు చేశారు. వర్షాలు అధికమవ్వడంతో ఆరుతడి పంటలైన మొక్కజొన్నపై ఎక్కువ ప్రభావం చూపుతోంది. మండలంలో సాధారణ సాగువిస్తీర్ణం 9090 హెక్టార్లు కాగా ఇందులో మొక్కజొన్న పంటను 4654 హెక్టార్లలో రైతులు సాగుచేశారు. అధిక వర్షాల కారణంగా వందల ఎకరాల్లో నేల జోము పట్టి మొక్కలు ఎర్రబడి చనిపోతున్నాయి. దీంతో రైతున్నల్లో ఆందోళన నెలకొంది. దీనికి తోడు కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం, ఈ క్రాప్ నమోదు, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి పథకాలేవీ అమలు చేయలేదు. దీంతో పంటలు సాగుచేసిన రైతుల్లో భయాందోళన నెలకొంది. గతంలో వైఎస్సార్‌సీపీ పాలనలో పంటలు దెబ్బతింటే తర్వాతి సీజన్ కల్లా నష్టపరిహారం అందేదని, ప్రస్తుతం ఇంకా ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం కూడా ప్రారంభం కాకపోవడంతో నష్టపరిహారం అందుతుందా లేదా అన్న సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ఏది ఏమైనా అధిక వర్షాలకు నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



నందికుంట సమీపంలో దెబ్బతిన్న మొక్కజొన్న పైరు

నాటుసారా పట్టివేత

మహానంది: గోపవరం మెట్ట వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒకరిని అదుపులోకి తీసుకొని 35 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమానంగా కనిపించిన అవుకు మండలం కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన మౌలాలి వద్ద తనిఖీ చేయగా సారా లభించిందని చెప్పారు.

ఆత్మకూరులో వర్షం

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో వర్షం కురిసింది. చిన్నగా ప్రారంభమై ఓ మోస్తరుగా కురిసింది. ఈ నెల 1వ తేదీ నుంచి ఆత్మకూరు మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నాలుగు లేదా ఐదు రోజులు మినహా అన్ని రోజుల్లో వర్షాలు కురిశాయి. దీంతో మొక్కజొన్న, కంది పంటలు దెబ్బతిన్నాయి. సుమారు వంద ఎకరాల్లో మొక్కజొన్న పంట ఎర్రగా మారింది.

వర్షం కోసం ఎదురుచూపులు



పీరుసాహెబ్ పేట గ్రామంలో వాడుముఖం పట్టిన మొక్కజొన్న పైరు

మిడుతూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న సాగు చేపట్టిన రైతన్నలు వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలపరిధిలోని మిడుతూరు, పీరుసాహెబ్ పేట, ఖాజీపేట, చెరుకుచెర్ల, బైరాపురం, దేవనూరు, సుంకేసుల, రోళ్లపాడు, అలగనూరు తదితర గ్రామాల్లో దాదాపు 1200 హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేపట్టారు. ఈ ఏడాది జూన్ ఆరంభంలోనే వర్షాలు కురవడంతో ఆయా గ్రామాల్లో మొక్కజొన్న సాగు చేపట్టారు. తర్వాత నెల రోజులు దాటినప్పటికీ అరకొర వర్షాలే కురవడంతో మొక్కజొన్న పైరు ఎదుగుదల లోపించింది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. నేల స్వభావాన్ని బట్టి పలు గ్రామాల్లో సాగు చేపట్టిన మొక్కజొన్న పైరు వాడుముఖం పట్టడంతో వర్షం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

వర్షం కురవకపోతే నష్టం తప్పదు



మొక్కజొన్నకు సకాలంలో వర్షాలు కురిస్తే మంచి దిగుబడులు వస్తాయి. జూన్‌లో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టాను. తర్వాత ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో పైరు వాడుముఖం పట్టింది. నాలుగైదు రోజుల్లో వర్షం కురిస్తే మొక్కజొన్న పైర్లు బాగుంటాయి. లేని పక్షంలో రైతులకు నష్టాలు చవిచూడాల్సిందే. – బోయ శ్రీనివాసులు, పీరుసాహెబ్ పేట

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ

బొమ్మలసత్రం: రౌడీషీటర్లు, సస్పెక్ట్ రౌడీషీటర్లు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్లలో పోలీస్ అధికారులు ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గతంలో నేరాలకు పాల్పడి ప్రజలకు ఇబ్బందులు కలిగించే 17 మందిని పీడీయాక్ట్ నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. రౌడీషీటర్లు ప్రజలను భయాందోళనకు గురిచేయకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు రాజారెడ్డి, నరసింహులు, దస్తగిరిబాబు తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

పాములపాడు: రైతు శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడతామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య స్పష్టం చేశారు. ఆయన ఆదివారం మండలంలోని బానకచెర్ల రెగ్యులేటర్ వద్ద గంగమ్మకు చీరె, సారెతో పూజలు నిర్వహించి జీఎన్ఎస్ఎస్‌కు నీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రెండు కార్ల పంటలకు సాగునీరందిస్తామని చెప్పారు. గతంలో పంటల సాగుకు నీరిస్తారో లేదో తెలియని అయోమయ పరిస్థితి ఉండేదని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవన్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారో ఆ దిశగా ప్రభుత్వం సాగుతుందని చెప్పారు. ఆగస్టు 15న దాదాపు 100 అన్న క్యాంటీన్లు ప్రారంభం కాబోతున్నాయన్నారు. జీఎన్ఎస్ఎస్‌కు 3000 క్యూసెక్కులు, తెలుగుగంగ (వీబీఆర్)కు 10,000 క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 2000 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల చేశారు. డీఈ రమణ, ఏఈ అనూష, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జీఎన్ఎస్ఎస్ నీటి విడుదలకు స్విచ్ ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

ముగిసిన రాష్ట్రస్థాయి వైద్య సదస్సు



రాష్ట్ర స్థాయి వైద్యసదస్సులో వైద్యులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ మణిదీప్

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మధుమణి నర్సింగ్‌హోం ఈఎన్‌టీ వైద్యులు మధుసూదనరావు, మణిదీప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల వైద్య శిబిరం, రాష్ట్రస్థాయి వైద్య సదస్సు ఆదివారం సాయంత్రానికి ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మధుసూదనరావు మాట్లాడుతూ ఈ ఉచిత శిబిరంలో మొత్తం 110 మందికి శస్త్ర చికిత్సలు, 1000 మందికి ఓపీడీలో ఉచితంగా చూడటం జరిగిందన్నారు. అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశామన్నారు. రూ.50లక్షల విలువైన వైద్యసేవలు నిరుపేదలకు అందించడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయి సదస్సులో 200 మందికి పైగా ఈఎన్‌టీ వైద్యులు శిక్షణ పొందడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు రోహిత్, విజయేంద్ర, వినయ్, విద్యాసాగర్, శ్రీపతినాయుడు, రవికృష్ణ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

వెలుగోడు: పట్టణంలోని శ్రీ నీలం సంజీవరెడ్డి డిగ్రీ కాలేజీ (ఎస్ఎన్ఎస్ఆర్) పూర్వ విద్యార్థుల సమావేశానికి డిగ్రీ కాలేజీ వేదిక అయ్యింది. 36 ఏళ్ల కిందట విడిపోయి ఉన్నత చదువులు చదివి కొందరు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలలో స్థిరపడ్డారు. అలాంటి పూర్వ విద్యార్థులందరూ చదువులమ్మ ఒడికి మళ్లీ చేరుకొని గత స్మృతులను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. 1985–1988 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి కరస్పాండెంట్ రత్నస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు రత్నస్వామిని పట్టు వస్త్రాలతో, రిటైర్డు ప్రిన్సిపాల్ రాంభూపాల్‌రెడ్డి, అధ్యాపకులు శ్యామ్‌ప్రసాద్‌శర్మ, హసన్, వెంకటస్వామిలను దుశ్శాలువా, పూలమాలలు, మొమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అంబాల ప్రభాకర్ రెడ్డి, ముక్కమళ్ల జయరాంరెడ్డి, జీ.శ్రీనివాసులు, శివారెడ్డి, రామలింగేశ్వరుడు, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కరస్పాండెంట్, అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

మహానందిలో సండే సందడి

మహానంది: ఆషాఢమాసం, వరుస వర్షాలతో కొద్ది రోజులుగా మహానందిలో రద్దీ లేక ఆలయ ప్రాంగణాలు వెలవెలబోయాయి. అయితే వర్షాలు తగ్గడంతో పాటు సెలవురోజు కావడంతో ఆదివారం భక్తజనంతో ఆలయం కళకళలాడింది. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు స్థానిక అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న భక్తులు

ఓంకారంలో భక్తులసందడి

బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రంలో ఆదివారం సెలవురోజు కావడంతో భక్తుల రద్దీ కనిపించింది. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ గంగ, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు చేపట్టారు. కొండపై వరకు ఏర్పాటు చేసిన వివిధ విగ్రహ దేవతలతో పాటు శ్రీ వెంకటేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. శ్రీ కాశిరెడ్డినాయన అన్నపూర్ణ ప్రసాద వితరణ కేంద్రం వద్ద భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.